నమస్తే తెలంగాణ

వరంగల్ హనుమకొండ

3 | గురువారం 15 ఫిబ్రవరి 2024 | WARANGAL HANUMAKONDA




గట్టమ్మ ఎదురుపిల్ల పండుగకు జిల్లా కేంద్రం నుంచి ర్యాలీగా వస్తున్న పూజారులు, ఆదివాసీ నాయకపోడు ప్రజలు

# ఘనంగా ఎదురుపిల్ల పండుగ

**101 బోనాలతో గట్టమ్మ వద్దకు బైలెల్లిన ఆదివాసీ నాయకపోడులు**

ములుగురూరల్, ఫిబ్రవరి 14 : ఆదిదేవత గట్టమ్మకు బుధవారం ఎదురుపిల్ల పండుగను ఆదివాసీ నాయకపోడు పూజారులు, కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆచార, సంప్రదాయాల నడుమ 101 ఇండ్లల్లో వండిన నైవేద్యంతో నాయకపోడు కమ్యూనిటీ హాల్ వద్దకు చేరుకున్నారు. 30 లక్ష్మీదేవరలకు ఆలయ పూజారి, కుల పెద్దమనిషి కొత్త సదయ్య చీరె, సారె, పోకవక్కలు, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా భారీ ర్యాలీతో గట్టమ్మకు చేరుకున్నారు. ప్రధాన పూజారి సదయ్య బోనాలతో మూడు సార్లు ప్రదర్శనలు చేసి ఆదిదేవతకు బోనాన్ని సమర్పించారు. లక్ష్మీదేవర, పోతరాజును ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎదురుపిల్లను గట్టమ్మ తల్లికి సమర్పించి ఆలయం ముందు ఏర్పాటు చేసిన కంకవనాన్ని, ఆవరణలో ఉన్న సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రతిష్ఠించారు. పసుపు, కుంకుమలను సమర్పించి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ఆపద రాకుండా చల్లగా చూడాలని వేడుకున్నారు. ర్యాలీ సందర్భంగా సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు జాతీయ రహదారిపై వాహనాలను వన్‌వే ద్వారా అనుమతించారు. కార్యక్రమంలో ప్రధాన పూజారులు కొత్త సదయ్య, కొత్త లక్ష్మయ్య, ఆకుల మొగిలి, అరిగెల సమ్మయ్య, రాష్ట్ర నాయకులు దయానందస్వామి, ఆనంద్, బుచ్చయ్య, నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్, భాగ్యలక్ష్మి, భూమయ్య, భాస్కర్, శ్రీను, లక్ష్మి, సారంగం, యాదగిరి, నర్సింహం, రాజేందర్, శివరామ్ పాల్గొన్నారు.



దీపం, బోనాలతో తరలివస్తున్న గట్టమ్మ పూజారులు

# మేడారం ట్రస్ట్ బోర్డులో ఆదివాసేతరులను తొలగించాలి

- ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకుంటాం
- ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బగట్ల సుమన్
- సేవాలాల్ జయంతి రోజు కార్యక్రమ నిర్వహణపై అభ్యంతరం



దబ్బగట్ల సుమన్

తాడ్వాయి, ఫిబ్రవరి 14: మేడారం ట్రస్ట్ బోర్డులో ఆదివాసేతరులను తొలగించాలని, లేకుంటే ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకుంటామని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బగట్ల సుమన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. మేడారం మహా జాతర ట్రస్ట్ బోర్డును ఆదివాసీలతో ఏర్పాటు చేయాలని అనేక సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోకుండా లంబాడీలు, గిరిజనేతరులను నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 11వ తేదీన ప్రమాణ స్వీకారం జరుగుతుందని ప్రకటించినప్పటికీ దానిని రద్దు చేసి సేవాలాల్ జయంతి రోజున నిర్వహించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివాసీ సంస్కృతీసంప్రదాయాలను జాతర ట్రస్ట్ బోర్డు నియామకంలో విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాక తప్పదని, 15వ తేదీన నియమించే ప్రమాణ స్వీకారాన్ని రద్దు చేయాలని కోరారు. మంత్రి సీతక్క కూడా ఎన్నికల ముందు కమిటీలో పూర్తిగా ఆదివాసీలతో ట్రస్ట్ బోరును నియమిస్తామని చెప్పారని, మాట తప్పకుండా హామీ నెరవేర్చాలని సుమన్ కోరారు.



సమ్మక్క గుడి వద్ద డోలి వాయిద్యాలతో పూజారులు


## పూజలకు మంత్రికి నో ఎంట్రీ

- ఇతరులకు ప్రవేశం లేదంటూ తేల్చి చెప్పిన పూజారులు
- బయటి నుంచి మొక్కుకొని వెనుదిరిగిన సీతక్క

ములుగు, ఫిబ్రవరి14(నమస్తేతెలంగాణ): మండమెలిగే పండుగ సందర్భంగా సమ్మక్క పూజారి సిద్ధబోయిన మునీందర్ ఇంటి వద్ద రాత్రి నిర్వహించిన ప్రత్యేక పూజలకు మంత్రి సీతక్కకు నో ఎంట్రీ చెప్పారు. తాను ఆదివాసీ బిడ్డనేనంటూ పూజల్లో పాల్గొనేందుకు అడిషనల్ కలెక్టర్, ఎస్పీ, సీఐ, రోప్ పార్టీలతో మునీందర్ ఇంటికి చేరుకున్న సీతక్కకు చుక్కెదురైంది. తాత ముత్తాతల నుంచి వస్తున్న వంశ ఆచారం ప్రకారం ఇతరులకు ప్రవేశం లేదని పూజారులు తెగేసి చెప్పారు. దీంతో చేసేదేమీ లేక సీతక్క, పూజారి ఇంటి గడప బయట నుంచి దండం పెట్టుకొని వెనుదిరిగారు. జాతర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మండ మెలిగే పండుగ నాడు పూజారుల ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి హోదాలో సీతక్క వెళ్లడం, పూజారులు ప్రవేశం లేదని వెనుదిరిగి వెళ్లిపోవాలని చెప్పడం ఇదే మొదటిసారి. ఎంతటి హోదాలో ఉన్న వ్యక్తులైనా ఆదివాసీల కట్టుబాట్ల ముందు తలవంచాల్సిందేనని మరోసారి రుజువైంది.



సమ్మక్క గుడి వద్దకు డోలి వాయిద్యాలతో వస్తున్న పూజారులు



# మండెమెలిగే.. మేడారం వెలిగే

**ఘనంగా శుద్ధి పండుగ ■ మహా జాతర ప్రారంభమైనట్లు పూజారుల సంకేతాలు**

తాడ్వాయి, ఫిబ్రవరి14: మేడారంలో బుధవారం మండెమెలిగే పండుగను సమ్మక్క-సారలమ్మ పూజారులు ఘనంగా నిర్వహించారు. మొదటగా సమ్మక్క పూజా మందిరంలో తల్లి గద్దెను, పూజా సామగ్రిని పూజారులు సిద్ధబోయిన మునీందర్, కృష్ణయ్య శుద్ధి చేశారు. అనంతరం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారుల కుటుంబాలకు చెందిన ఆడపడుచులు తల్లి గద్దెకు అలుకుపూతలు నిర్వహించి, ముగ్గులతో అలంకరించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం డోలివాయిద్యాల నడుమ గ్రామంలోని బొడ్రాయి, పోచమ్మ గుళ్లకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రధాన పూజారి సిద్ధబోయిన మునీందర్ ఇంటి నుంచి మామిడి తోరణాలు, పసుపు, కుంకుమలు తీసుకుని గ్రామ శివారుకు చేరుకున్నారు. బూరుగు కర్రలతో రెండు ప్రధాన రహదారులకు ఇరువైపులా మామిడి తోరణాలు, ఆనపకాయ బుర్రతో పాటు కోడిపిల్లను కట్టి ఎలాంటి దుష్టశక్తులు గ్రామంలోకి రాకుండా కట్టు వేశారు. ధ్వజ స్తంభాల వద్ద కల్లు సాకను ఆరబోశారు. అక్కడి నుంచి సమ్మక్క పూజా మందిరానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. మండెమెలిగే పండుగతో మహాజాతర ప్రారంభమైనట్లు పూజారులు సంకేతాలు ఇస్తారు. అదేవిధంగా కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయం లో పూజారి కాక సారయ్య అమ్మవారి పూజా సామగ్రిని, పూజామందిరాన్ని నీటితో కడిగి శుభ్రం చేశారు. తల్లి అడెరాలను శుద్ధి చేసి అలంకరించారు. బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి, అడేరాలకు చీరె, సారె, పసుపు, కుంకుమ సమర్పించారు. పూజామందిరాన్ని పూలతో అలంకరించారు.

### రాత్రంతా జాగారం

కన్నెపల్లి నుంచి సారలమ్మ పూజారులు, మేడారం నుంచి సమ్మక్క పూజారులు తల్లుల గద్దెల వద్దకు చేరుకుని ఒకరికి ఒకరు సాకను ఇచ్చిపుచ్చుకుని రహస్య పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రంతా గద్దెల ఆవరణలో జాగారాలు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆయా పూజా మందిరాల్లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇళ్లకు చేరుకుంటారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 8 నుంచి గురువారం ఉదయం ఆరు గంటల వరకు భక్తులను అమ్మవార్లను దర్శించుకునేందుకు అనుమతించరు.



మామిడి ఆకుల తోరణానికి కోడిపిల్లను కట్టిన పూజారులు

పూజారి మునీందర్ ఇంటి నుంచి రాత్రి సమ్మక్క పూజా సామగ్రిని తీసుకొస్తున్న పూజారులు



కల్లు సాక పోస్తున్న పూజారులు



కన్నెపల్లిలో సారలమ్మ పూజా సామగ్రిని శుద్ధి చేస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య



గంట కొడుతున్న భక్తురాలు



అమ్మవారి గద్దెల వద్ద భక్తుల కోలాహలం

# వనజాతరకు జనమే జనం

- సమ్మక్క-సారలమ్మకు ముందస్తు మొక్కులు
- సందడిగా మారుతున్న మేడారం పరిసరాలు



అమ్మవారి గద్దెల వద్ద భక్తులు



తాడ్వాయి, ఫిబ్రవరి 14 : వన జాతర మేడారానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. మహా జాతరకు మరో ఆరురోజులే ఉండడంతో తల్లులకు ముందస్తు మొక్కులు చెల్లిస్తున్నారు. వరాలిచ్చే సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని దీవెనలు పొందుతున్నారు. బుధవారం పూజారులు మండె మెలిగే పండుగ నిర్వహిస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన వారు మొదట జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి వాగు ఒడ్డున ఉన్న నాగులమ్మ, జంపన్న గద్దెలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి గద్దెల వద్దకు చేరుకున్నారు. సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, పూలు, పండ్లు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉదయం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో అధికారులు గద్దెల గ్రిల్స్‌కు తాళాలు వేసి బయటినుంచే దర్శనం కల్పించారు. మధ్యాహ్నం సమయానికి రద్దీ తగడంతో లోపలికి అనుమతించారు. దర్శనం అనంతరం భక్తులు గద్దెలు, జాతర పరిసరాల్లో విడిది చేశారు.

# శునకం నిలువెత్తు బంగారం!

ఖానాపురం, ఫిబ్రవరి 14: మేడారం సమ్మక్క-సారలమ్మకు భక్తులు నిలువెత్తు బంగారం(బెల్లం) ఇచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. కానీ, వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని మంగళవారిపేట గ్రామానికి చెందిన దబ్బెట ఉపేందర్-నాగలక్ష్మి దంపతులు తమ పదేళ్ల పెంపుడు కుక్క నిలువెత్తు బంగారాన్ని వనదేవతలకు సమర్పించేందుకు మొక్కుకున్నారు. ఈ మేరకు బుధవారం కిరాణా షాపులో కుక్కను త్రాసులో కూర్చొబెట్టగా 8 కిలోల బంగారం తూగింది. శుక్రవారం కుటుంబ సమేతంగా మేడారం వెళ్లి తల్లులకు బంగారం సమర్పించనున్నట్లు వారు తెలిపారు.



కుక్క నిలువెత్తు బంగారం తూకం వేస్తున్న ఉపేందర్ దంపతులు

# నిబంధనలకు పాతర

- రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు
- విస్తరణ చేయకుండానే బీటీ నిర్మాణం
- సైడ్‌బర్మ్ లేక వాహనదారుల ఇక్కట్లు



రోడ్డు వేసిన 20 రోజులకే దెబ్బతింటున్న బీటీ

వర్ధన్నపేట, ఫిబ్రవరి 14: రోడ్డు నిర్మాణంలో అధికారులు నిబంధనలు పాటించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొత్తపల్లి ఆకేరువాగు బ్రిడ్జి నుంచి ఇల్లంద గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ఇటీవల బీటీరోడ్డు వేశారు. ఈ రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బర్మ్‌లు వేయకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏమరపాటుగా వాహనం నడిపితే అదుపు తప్పి పంట పొలాల్లో పడిపోయే పరిస్థితి నెలకొంది. దీనికితోడు పంట పొలాలకు వెళ్లే బాటలకు బీటీ రోడ్డు నుంచి ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు వెళ్తుండడంతో నెల రోజులు కాకముందే రహదారి పాడవుతున్నది.

### రూ. 40 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం

కేసీఆర్ ప్రభుత్వం ఆకేరువాగులో వర్షపు నీటిని నిల్వ చేయడంతోపాటు గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు బ్రిడ్జి, చెక్‌డ్యామ్‌తోపాటు కొత్తపల్లి నుంచి ఇల్లంద వరకు బీటీరోడ్డు నిర్మాణం కోసం రూ. 12 కోట్లు విడుదల చేసింది. ఇందులో భాగంగానే కొత్తపల్లి-ఇల్లంద సబ్‌స్టేషన్ వరకు మూడు కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం అధికారులు రూ. 40 లక్షలు వెచ్చించి నెల రోజుల క్రితమే బీటీ వేశారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిలోని ఇల్లంద నుంచి కొత్తపల్లి, ల్యాబర్తి గ్రామాలతో పాటు పర్వతగిరి, రాయపర్తి మండలాల్లోని ప్రజలకు దూరభారం తప్పే అవకాశం ఉంది. అయితే, రోడ్డును విస్తరించి బీటీ వేస్తే వాహనదారులకు సౌకర్యంగా ఉండేది. కానీ, అధికారులు వైడెనింగ్ చేపట్టకుండా రోడ్డు వేయడంతో ఇరుకుగా మారి వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. రోడ్డు ఎత్తుగా ఉండి పక్కనే ఉన్న పంట పొలాలు లోతట్టుగా ఉండడంతో వాహనాలు అదుపుతప్పితో లోతట్టు ప్రాంతంలో పడిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సైడ్‌బర్మ్‌లు వేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

### మొరం కొరతతో జాప్యం

కొత్తపల్లి-ఇల్లంద రోడ్డుకు మొరం కొరత వల్ల సైడ్‌బర్మ్‌లు పోయడంలో జాప్యం జరుగుతున్నది. వర్షపు నీరు వెళ్లేందుకు కూడా అనువైన ప్రదేశాల్లో సీసీ పైపులు వేయించాం. రైతులు పొలాలకు వెళ్లే దారుల వద్ద బీటీ పాడవకుండా, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా త్వరలోనే రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బర్మ్‌లు నిర్మిస్తాం.

– అనిల్, ఏఈ

# మామ చేతిలో అల్లుడు హతం

- కుటుంబ కలహాలతో దారుణం
- రంగశాయిపేటలో ఘటన



శ్రీనివాస్(ఫైల్)

కరీమాబాద్, ఫిబ్రవరి 14: కుటుంబ కలహాల నేపథ్యంలో మామ చేతిలో అల్లుడు హత్యకు గురైన ఘటన రంగశాయిపేటలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రంగశాయిపేటకు చెందిన బజ్జూరి రమేశ్ తన కుమార్తెను రంగంపేటకు చెందిన శ్రీనివాస్‌కు ఇచ్చి 11 ఏళ్ల క్రితం వివాహం జరిపించాడు. నాటి నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా వారిలో మార్పు రాలేదు. ఈ వివాదం కోర్టులో సైతం కొనసాగుతున్నది. ఈ క్రమంలో రమేశ్ కొంతకాలంగా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. ఈ నేపథ్యంలో రంగశాయిపేటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తుండగా రమేశ్ కుటుంబంతో వచ్చి పూజల్లో పాల్గొన్నాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ రంగశాయిపేటకు చేరుకొని రమేశ్‌తో గొడవపడ్డాడు. మాటామాట పెరగడంతో రమేశ్ నెట్టివేయడంతో శ్రీనివాస్ తల గోడకు తాకింది. దీంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్ మిల్స్ కాలనీ పోలీసుల ఎదుట లొంగిపోయాడు.